# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 121 క్రిష్ణా, సోమవారం 26 - 01 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## వాదన వినిపించండి.. నిధులు తీసుకురండి.



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు.. పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి అత్యధికంగా కేంద్ర నిధులు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలను పార్లమెంట్?లో బలంగా ప్రస్తావించాలని చంద్రబాబు సూచించారు. అమరావతి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రెండో విడత నిధులు, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసేందుకు కేంద్ర సహకారం, విశాఖ రైల్వే జోన్?కు నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, జాతీయ రహదారుల వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.

అమరావతి చట్టబద్ధతపై ప్రస్తావిస్తామన్న టీడీపీ ఎంపీలు

అమరావతికి చట్టబద్ధతపై పార్లమెంట్?లో ప్రస్తావిస్తామన్నారు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు. అమరావతిపై కన్ఫ్యూజన్ ఉండకూడదన్నదే తమ విధానమన్నారు. అమరావతిలో పెట్టుబడులు పెరగడానికి, నిర్మాణాల వేగం పుంజుకోవడానికి ఇది ఎంతో కీలకమన్నారు.

నల్లమలసాగర్?పై సభలో మాట్లాడతామన్న ఎంపీ లావు

ఇక పోలవరం ద్వారా రాయలసీమకు నీరు ఇవ్వాలంటే.. నల్లమలసాగర్?ను చేపట్టాల్సి ఉందన్నారు లావు శ్రీకృష్ణదేవరాయలు. ఈ ప్రాజెక్ట్?కు కావాల్సిన నిధులపై సమావేశాల్లో మాట్లాడతామన్నారు.రాయలసీమలకు జగన్ చేసిందేమీ లేదన్న టీడీపీ ఎంపీలు

వీటితో పాటు పార్టీ అధినేత చంద్రబాబు సూచించిన అనేక అంశాలను పార్లమెంట్?లో ప్రస్తావిస్తామన్నారు టీడీపీ ఎంపీలు. రాయలసీమకు జగన్? చేసిందేమీ లేదని విమర్శించారు.


## మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్‌తో కలిసి నాందేడ్ గురుద్వారాను సందర్శించిన పవన్ కల్యాణ్



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం మహారాష్ట్రలోని ప్రఖ్యాత నాందేడ్ తఖ్త్ సచ్ ఖండ్ గురుద్వారాను సందర్శించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్?తో కలిసి ఆయన ఈ పర్యటనలో పాల్గొన్నారు. సిక్కుల పదో గురువు గురు గోవింద్ సింగ్ సమాధి మందిరంలో ఇరువురు నేతలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పవిత్ర చాదర్?ను సమర్పించారు.గురు తేగ్ బహదూర్ సింగ్ 350వ షాహిదీ సమాగమంలో పాల్గొనేందుకు నాందేడ్ వచ్చిన పవన్ కల్యాణ్, మధ్యాహ్నం సచ్ ఖండ్ గురుద్వారాకు చేరుకున్నారు. గురుద్వారా ఛైర్మన్ డాక్టర్ విజయ్ సత్పాల్ సింగ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా గురుద్వారా ప్రముఖులు పవన్ కల్యాణ్?కు సంప్రదాయ సిక్కు తలపాగాను అలంకరించారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి ఫడ్నవిస్?తో కలిసి ప్రధాన మందిరంలోకి ప్రవేశించారు. గురు గోవింద్ సింగ్ సమాధి వద్ద ప్రార్థనలు చేసి, చాదర్ సమర్పించారు. గురుద్వారా గ్రంథీలు పవిత్ర వస్త్రంతో పవన్ కల్యాణ్, ఫడ్నవిస్?లను ఆశీర్వదించారు. దర్శనం అనంతరం గురుద్వారా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ డొనేషన్ మెషీన్?ను వారు ప్రారంభించారు.అంతకుముందు, తొలిసారి గురుద్వారాకు విచ్చేసిన పవన్ కల్యాణ్?ను సిక్కు మత పెద్దలు ఘనంగా సత్కరించారు. గురుద్వారా జ్ఞాపికతో పాటు, సిక్కులు పవిత్రంగా భావించే కిర్పాన్?ను బహుకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్థానిక మీడియాతో మాట్లాడుతూగురు తేగ్ బహదూర్ సింగ్ దేశం మొత్తానికి స్ఫూర్తిప్రదాత. ఆయన చేసిన త్యాగం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. అలాంటి మహనీయుడి షాహిదీ సమాగమంలో పాల్గొనడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను అని తెలిపారు. సిక్కుల ఐదు అత్యున్నత పీఠాల్లో ఒకటైన ఈ గురుద్వారా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది

## ప్రధాని ప్రశంసలపై హర్షం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్?లోని అనంతపురం జిల్లా ప్రజల కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించి, వారిని కొనియాడారు. జల సంరక్షణ కోసం వారు చేస్తున్న స్ఫూర్తిదాయక ప్రయత్నాలను అభినందించారు. ప్రధాని ప్రశంసలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల వనరుల పునరుద్ధరణ కోసం ఆంధ్రప్రదేశ్?లోని అనంతపురం ప్రజలు చేస్తున్న కృషి ఎంతో ప్రశంసనీయం అని అన్నారు. వారి నిబద్ధతను, సామూహిక ప్రయత్నాలను కొనియాడారు. కరవు పీడిత ప్రాంతంలో జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ప్రధాని ప్రశంసలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.గౌరవనీయులైన ప్రధానమంత్రి గారూ, అనంతపురం ప్రజల స్ఫూర్తిదాయకమైన ప్రయత్నాలను మీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రస్తావించినందుకు ధన్యవాదాలు అని చంద్రబాబు పేర్కొన్నారు. జల భద్రత అనేది తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర విజన్'లో పొందుపరిచిన 'పది సూత్రాలలో' ఒక కీలకమైన అంశమని ఆయన గుర్తుచేశారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సంప్రదాయ నీటి నిర్వహణ పద్ధతులను సమర్థంగా అనుసంధానం చేస్తూ, రాష్ట్రంలో బలమైన జల సంరక్షణ మౌలిక సదుపాయాలను నిర్మించడానికి



తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా తాము చేస్తున్న ప్రయత్నాలకు, ప్రధాని నరేంద్ర మోదీ నుంచి వచ్చిన ఈ ప్రశంస మరింత ప్రేరణను, ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆయన వివరించారు. జల సంరక్షణ వంటి కీలకమైన అంశంపై ప్రధాని దృష్టి సారించడం పట్ల సీఎం సంతోషం వ్యక్తం చేశారు. కరవు నివారణకు తాము చేపడుతున్న కార్యక్రమాలకు ఇది మరింత బలాన్నిస్తుందని అభిప్రాయపడ్డారు.

## కిడ్నీ బాధితులకు కూడా ఉచితంగా ఆ సేవలు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** కిడ్నీ రోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మారుమూల ప్రాంతాల్లో నివసించే వారికి కూడా డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకురాబోతోంది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ ఒక కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రులలో త్వరలోనే మరో 13 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

ఈ 13 కొత్త డయాలసిస్ కేంద్రాలలో రెండు కేంద్రాలను ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. అక్కడ రోగులకు త్వరలోనే డయాలసిస్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మిగిలిన 11 కేంద్రాలు ఏప్రిల్ నాటికి సిద్ధమవుతాయని మంత్రి వెల్లడించారు. గతంలో ప్రకటించిన వాటితో పాటు తాజాగా మంజూరైన ఐదు కేంద్రాలను కలిపి సెకండరీ ఆసుపత్రులలో మొత్తం 13 డయాలసిస్ కేంద్రాలు రానున్నాయని పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు ఐదు కొత్త డయాలసిస్ కేంద్రాలకు అనుమతి లభించిందని మంత్రి ప్రకటించారు. ఈ కేంద్రాలను తిరుపతి జిల్లాలోని రైల్వే కోడూరు, ప్రకాశం జిల్లాలోని కొండపి, తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు, కడప జిల్లాలోని మైదుకూరు, ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ ఆసుపత్రులలో ఏర్పాటు చేయనున్నారు.

శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వీటి గురించి వివరాలు వెల్లడించారు. ఈ కొత్త డయాలసిస్ కేంద్రాలను 'ప్రధాన మంత్రి నేషనల్ డయాలసిస్' ప్రోగ్రామ్ కింద మంజూరు చేశారని మంత్రి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, చిత్తూరు జిల్లాలోని పిలేరు, నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి, ప్రకాశం జిల్లాలోని అద్దంకి, నంద్యాల జిల్లాలోని సున్నిపెంట, కడప జిల్లాలోని జమ్మలమడుగు ఆసుపత్రులలో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ప్రస్తుతం టెండర్ దశలో ఉందని ఆయన పేర్కొన్నారు.విజయనగరం జిల్లాలోని ఎస్. కోట, పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేటలోని ఏజెన్సీ ప్రాంత ఆసుపత్రులలో రెండు డయాలసిస్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు త్వరలోనే సేవలు ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. ప్రతి డయాలసిస్ కేంద్రంలో సుమారు రూ. 85 లక్షల విలువైన పరికరాలు ఉంటాయి. మొత్తం 13 కేంద్రాల ఏర్పాటుకు రూ. 11.05 కోట్ల ఖర్చు అవుతుంది. ప్రతి కేంద్రంలో ఐదు డయాలసిస్ యంత్రాలు ఉంటాయని ఆయన తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏర్పాటు చేసిన 12 డయాలసిస్ కేంద్రాలలో ఇప్పటికే రోగులకు సేవలు అందుతున్నాయని మంత్రి తెలిపారు. మరో 13 కేంద్రాలు త్వరలో అందుబాటులోకి వస్తే, ప్రభుత్వ 19 నెలల పాలనలో మొత్తం 25 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. దీని వల్ల వేలాది మంది రోగులకు ఉచిత డయాలసిస్ సేవలు చేరువ అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రైవేట్ ఆసుపత్రులలో ఒక్కో డయాలసిస్?కు సుమారు 3 నుంచి 4 వ రూపాయల వరకు ఖర్చు అవుతుంది. నెలకు కనీసం పదిసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితుల్లో సామాన్యులకు అది ఆర్థిక భారంగా మారుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,047 కేంద్రాల ద్వారా ఉచిత డయాలసిస్ సేవలు అందిస్తోంది.


## ఎంపీలు టీడీపీ శ్రేణులతో మమేకమవ్వాలి.. మంత్రి లోకేశ్ దిశానిర్దేశం.

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమరావతి, జనవరి25 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి, నారా లోకేశ్ టీడీపీ ఎంపీలతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. దాదాపు గంట పాటు ఎంపీలతో లోకేశ్ విడిగా భేటీ అయ్యారు. మంత్రులతో పాటు ఎంపీలు పార్టీ కేంద్ర కార్యాలయానికి తప్పనిసరిగా రావాలని హుకుం జారీ చేశారు. రాష్ట్ర మంత్రితో సమన్వయం చేసుకునేలా ప్రతీ ఎంపీకి కొన్ని శాఖలు అప్పగించామని స్పష్టం చేశారు. సంబంధిత శాఖా మంత్రి పార్టీ కార్యాలయానికి వచ్చినప్పుడు ఆ మంత్రి శాఖలు కేంద్రంతో సమన్వయం చేసే ఎంపీ కూడా రావాలని సూచించారు. ప్రజాదర్బార్?లో ఇద్దరూ పాల్గొనటంతో పాటు శాఖాపరమైన అంశాలపై కేంద్రంతో సమన్వయం కోసం ఇద్దరూ చర్చించుకోవాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. రెండు సెషన్స్ కింద బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నందున మొదటి సెషన్ తర్వాత వచ్చే విరామం సమయంలో ప్రతీ ఎంపీతో వన్ టు వన్?గా విషయాలపై మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం వద్ద పెండింగ్?లోని ప్రతీ రాష్ట్ర సమస్యపై ఎంపీలు అప్?డేట్?గా ఉండాలని సూచించారు.నియోజకవర్గాల్లో కార్యకర్తలు, ఎమ్మెల్యేల మధ్య బంధం మరింత బలపడేలా ఎంపీలు కృషి చేయాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. ఎంపీల పనితీరుపై కేంద్రం నుంచి వస్తున్న



నివేదికలు బాగున్నా పనితీరు ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. పార్టీకి ఎక్కువ సమయం కేటాయిస్తూనే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. కార్యకర్తలు సంతృప్తి చెందేలా వారి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎంపీలు కృషి చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

# అనంతపురం జిల్లా ప్రజలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** అనంతపురం జిల్లా.. దేశంలోనే కరవు కాటకాలకు పేరొందిన జిల్లా. బీడువారిన భూములు.. మోడువారిన మోములు.. నీరు లేక ఎండిన పంటలు.. ఆశలు కూలి రాలిన బతుకులు.. పెన్నా పరవళ్లు.. చిత్రావతి చిందులు మూగబోయి.. పంట పొలాలపై కమ్మేస్తున్న ఇసుక మేటలు.. అయినా ఎర్రని ఎండకు ఒంట్లో మరిగే రక్తంతో.. భూమాతపై నమ్మకంతో.. రేపటి మీద ధైర్యంతో.. నమ్ముకున్న సేద్యంపై ప్రేమతో.. ముందడుగు వేసే రైతన్న.. ఇదీ పేరులోనే పేదరికాన్ని నింపుకున్న అనంతపూర్ జిల్లా ఒకప్పటి పరిస్థితి. కానీ రోజులు మారుతున్నాయ్.. రైతులు సేద్యం చేసే తీరు మారుతోంది.. వెరసి అనంతపురం జిల్లా దేశానికి స్ఫూర్తిగా నిలిచేలా అడుగులు వేస్తోంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా తన ప్రసంగంలో అనంతపురం జిల్లాను ప్రశంసించారంటే.. అర్థం చేసుకోవచ్చు.

ఆదివారం మన్?కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాల గురించి తన ప్రసంగంలో పేర్కొనే ప్రధాని ఈసారి అనంతపురం జిల్లా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అనంతపురం జిల్లాలో నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనేందుకు.. అనంతపురం జిల్లా ప్రజలు చేపడుతున్న చర్యలను మోదీ ప్రశంసించారు. వర్షం సరిగా కురవని పరిస్థితులలో, తీవ్ర నీటి కొరత కారణంగా పడే ఇబ్బందులను ఎదుర్కొనడానికి అనంతపురం జిల్లా ప్రజలు స్వయంగా జలాశయాలను పునరుద్ధరించుకుంటున్నారని ప్రధాని మోదీ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారంతో ఇప్పటి వరకూ ఇలా పదికిపైగా జలాశయాలను పునరుద్ధరించుకున్నారని అభినందించారు. ఏడు వేలకు పైగా చెట్లను నాటిన విషయాన్ని గుర్తు చేశారు.

"అనంతపురం జిల్లా తీవ్రమైన నీటి కొరతతో ఇబ్బందులు పడుతోంది. ఇక్కడ ఎర్రమట్టి నేలలు, ఇసుక నేలలు ఉన్నాయి. ప్రజలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి చాలా ప్రాంతాల్లో సరైన వర్షపాతం లేదు. అనంతపురం పరిస్థితిని చాలాసార్లు ఎడారి పరిస్థితులలో పోల్చారు. అయితే ఈ సమస్య నుంచి బయటపడేందుకు అక్కడి జనం జలాశయాలను క్లీన్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో ఆ పని చేపట్టారు.

అనంత నీరు సంరక్షణ ప్రాజెక్టు ప్రారంభించారు. ఈ ప్రయత్నాలతో పదికి పైగా జలాశయాలను పునరుద్ధరించారు. ప్రస్తుతం ఈ జలాశయాలలో నీరు చేరింది. అలాగే 7 వేలకుపైగా చెట్లను నాటారు. నీటి సంరక్షణ విధానాలే కాదు అనంతపురంలో పచ్చదనం కూడా పెరిగింది. చిన్న పిల్లలు వాటిలో ఈత కూడా కొడుతున్నారు. వారి కృషితో ఆ ప్రాంతంలో ఎకోసిస్టమ్ మొత్తం మారిపోయింది. "

# అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటీలో వరుసగా చనిపోతున్న కాకులు


**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** అనంతపురం నగరం శివారు ప్రాంతంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఓ రకమైన ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. యూనివర్సిటీ ప్రాంగణంలో గత మూడు రోజులుగా పక్షులు అకస్మాత్తుగా చనిపోతూ ఉండటం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పదుల సంఖ్యలో కాకులు చనిపోతున్నాయి. ఎస్కే యూనివర్సిటీ ఆవరణతో పాటు సమీపంలో ఉన్న వనమిత్ర అటవీ ఉద్యానవన ప్రాంతంలోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. అక్కడ పావురాలు చనిపోతున్న పరిస్థితి. చెట్ల మీద ఉన్న పక్షులు.. అకస్మాత్తుగా కిందపడి ఉన్నట్లుండి ప్రాణాలు విడుస్తూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇందుకు ఇన్?ఫ్లూయెంజా వైరస్ కారణమని అధికారులు చెప్తున్నారు.

ఈ వింత మరణాలపై సమాచారం అందుకున్న ఎస్కేయూ బోటనీ, జువాలజీ విభాగాధిపతి ఆచార్య రవిప్రసాద్ రావు శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన కాకులను పరిశీలించారు. ఇవి కారణంగా ఇన్?ఫ్లూయెంజా వైరస్ కారణంగా చనిపోతున్నాయని ఆయన తెలిపారు. వాతావరణ మార్పులు లేదా ఇతర వలస పక్షుల ద్వారా ఈ వైరస్ వ్యాపించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇలా చనిపోయిన పక్షులను నేరుగా తాకితే శ్వాసకోశ, కళ్లకలక వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కర్రల సాయంతో వీటిని భూమిలో పూడ్చటం లేదా దహనం చేయాలని ఆయన సూచించారు. మరోవైపు ఇటీవలి కాలంలో కేరళలోనూ ఇలాంటి పరిస్థితే కనిపించింది. కన్నూరు జిల్లాలో పెద్ద సంఖ్యలో కాకులు చనిపోయాయి. దీంతో అధికారులు



దిగి పరీక్షలు నిర్వహించారు. వైరస్ కారణంగా అవి చనిపోయినట్లు గుర్తించారు. అయితే కాకుల నుంచి వేరే పక్షులకు ఈ వైరస్ సోకలేదని తెలిపారు. ఆ ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యలు కూడా చేపట్టారు. మరోవైపు అనేది ఇన్?ఫ్లూయెంజా వైరస్. దీని కారణంగా పక్షులలో శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. ఈ వైరస్ కారణంగా చనిపోయిన పక్షులను నేరుగా తాకితే మనుషులకు కూడా వ్యాపించే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఇలా చనిపోయిన వాటిని లోతుగా గోతి తీసి పూడ్చిపెట్టాలని లేదా.. దహనం చేయాలని సూచిస్తున్నారు.

# రూ. 15 వేల పెట్టుబడికి 400 శాతం ఆదాయం




**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** కరవు కాటకాలకు నిలయమైన అనంతపురం జిల్లాలో ఇప్పుడు ఓ కొత్త రకమైన పంట రైతుల ముఖాల్లో ఆనందం నింపుతోంది. అనంతపురం జిల్లా అంటేనే వర్షాభావ పరిస్థితులకు, నీటి కొరతకు పేరు. ఇలాంటి వాతావరణ పరిస్థితులలో తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో లాభాలను తెచ్చిపెట్టే ఓ పంట రైతులకు ఆశను కల్పిస్తోంది. సంప్రదాయ పంటలు లాభదాయకంగా లేని పరిస్థితులలో అనంతపురం రైతులు ఈ ప్రత్యామ్నాయ పంటవైపు ఆసక్తి చూపుతున్నారు. అదే చియా సాగు . చియా సాగుకు.. పెద్ద మొత్తంలో నీరు అవసరం లేదు. అలాగే పెట్టుబడి కూడా తక్కువ. దీంతో రైతులు చియాసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో రైతులు చియా సాగుతో లాభాలు గడిస్తున్న నేపథ్యంలో అనంతపురం జిల్లా రైతులు కూడా చియా సాగు మీద ఆసక్తి చూపుతున్నారు.మరోవైపు చియా అనేది మెక్సికో దేశానికి చెందిన పంట. చియా విత్తనాలలో ఫైబర్?, ఒమేగా--3 వంటి పోషకాలు ఉన్నాయి. అలాగే ఆరోగ్య ప్రయోజనాలు కూడా అధికం. దీంతో మార్కెట్లో చియా గింజలకు మంచి డిమాండ్ ఉంది. చియా సాగులో మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఈ పంటకు సేంద్రియ ఎరువులనే ఉపయోగించాలని అధికారులు చెప్తున్నారు. అప్పుడే చియా విత్తనాల దిగుబడి, పోషక విలువలలో నాణ్యత ఉంటుందంటున్నారు. అలాగే మూడు నెలలకోసారి పంట చేతికి వస్తుంది. వర్షాకాలం తప్ప ఏడాదిలో రెండు సార్లు పంట తీయవచ్చు. ముఖ్యంగా శీతాకాలం చియాసాగుకు అనుకూలం. దీనికి తోడు చియా సాగులో తెగుళ్లు, చీడపీడల బెడద ఉండదని అధికారులు చెప్తున్నారు.

ఈ క్రమంలోనే తాడిపత్రి నియోజకవర్గంలోని యల్లనూరుకు చెందిన సాంబశివారెడ్డి అనే రైతు కర్ణాటక రైతుల నుంచి చియా విత్తనాలను సేకరించి చియా సాగు మొదలుపెట్టాడు. చియా సాగు కోసం ఎకరాకు 15 వేల వరకూ పెట్టుబడి ఖర్చు అవుతోందని సాంబశివారెడ్డి తెలిపారు. తాను మూడు ఎకరాలలో పంట సాగు చేశానని వెల్లడించారు. ఎకరాకు 3 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో చియా గింజలు రూ. 200 వరకూ పలుకుతున్నాయని తెలిపారు. తనకు 45 వేల రూపాయల పెట్టుబడి కాగా.. రూ. 1.80 లక్షలు వస్తుందని తెలిపారు. ఆ లెక్కన పెట్టిన పెట్టుబడికి 4 రెట్లు అంటే 400 శాతం ఆదాయం సమకూరుతుందని అంచనా.

# ప్రేమించిన వ్యక్తి భార్యపై దాడి చేయించిన ప్రియురాలు

తాను ప్రేమించిన వ్యక్తి వేరొకరిని వివాహం చేసుకున్నాడనే ఆగ్రహంతో, అతని భార్యను లక్ష్యంగా చేసుకుని ఓ మాజీ ప్రియురాలు దారుణానికి ఒడిగట్టిన ఘటన కర్నూలు నగరంలో సంచలనం రేపింది. ఈ మేరకు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన ఒక వైద్యుడు ఆదోనికి చెందిన యువతితో కొంతకాలం ప్రేమ వ్యవహారం కొనసాగించి, ఆ తరువాత విడిపోయారు. అనంతరం ఆ వైద్యుడు మరో మహిళా వైద్యురాలిని వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన భార్య కర్నూలు వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్?గా విధులు నిర్వహిస్తుండగా, ఆయన కర్నూలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తాను ప్రేమించిన వ్యక్తి మరొకరిని పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన మాజీ ప్రియురాలు, ఆ దంపతులను విడదీయాలనే దురుద్దేశంతో పథకం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో, ఈ నెల 9న విధులను ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వెళుతున్న మహిళా వైద్యురాలిపై నలుగురు వ్యక్తులతో దాడి చేయించినట్లు విచారణలో తేలింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆమెను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టి కింద పడేసిన నిందితులు, సహాయం చేస్తున్నట్లు నటిస్తూ ఆటోలో ఎక్కించి ఒక వైరస్ (హెచ్?ఐవీ) ఇంజెక్షన్ ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కర్నూలు 3వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# క్యాన్సర్ పై యుద్ధభేరి.. నోరి

**క్రైం కౌంటర్ న్యూస్,** విజయవాడ, జనవరి 25 దేశంలో నానాటికీ విశ్వరూపం దాలుస్తున్న క్యాన్సర్ మహమ్మారిపై యుద్ధభేరిని మోగించి.. దాన్ని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రెండు తెలుగు రా(ష్ట్రాల ప్రభుత్వాలకూ మార్గనిర్దేశం చేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత రేడియేషన్ ఆంకాలజిస్ట్.. డాక్టర్ నోరి దత్తాత్రేయుడు! జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో నేతలకు ఆత్మీయ వైద్యుడైన ఆయన.. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం మంటాడ గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య స్థానికంగా పూర్తి చేసిన ఆయన.. మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాల(నేషనల్ కాలేజీ)లో పీయూసీ, కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. ఆ తర్వాత ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎండీ పూర్తి చేశారు. ఐదు దశాబ్దాలుగా ప్రముఖ ఆంకాలజిస్టుగా విశిష్ట సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలోని టాప్ 5 క్యాన్సర్ వైద్య నిపుణులలో ఆయన ఒకరు. 9రకాల క్యాన్సర్లకు చికిత్సలు అందిస్తున్న వైద్యుడిగా ప్రసిద్ధి పొందారు. భారత్‌తో పాటు అనేక దేశాల్లో క్యాన్సర్ చికిత్సా కేంద్రాలను స్థాపించడానికి కృషి చేశారు. ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్న ఆయన.. అప్పుడప్పుడూ తన స్వగ్రామాన్ని సందర్శిస్తుంటారు. దత్తాత్రేయుడు సతీమణి సుభద్ర కూడా డాక్టర్. వీరికి ఇద్దరు సంతానం. వైద్యరంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన 'మంటాడ టూ మ్యాన్‌హ్యాటన్ ' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని నిరుడు మార్చిలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. క్యాన్సర్ చికిత్సకు సంబంధించి విశేష సేవలందిస్తున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడి కృషిని గుర్తించి.. కేంద్ర ప్రభుత్వం ఆయనకు 2015లో పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

# ఎడారీకరణ.. నియంత్రణ..!

**అనంతపురం జిల్లాలో ఉద్యాన పంటల సాగుతో ఇసుక మేటల విస్తరణ కట్టడికుంటల నిర్మాణాలతో భూగర్భ జలాల పెంపు**

**కరువు కట్టడికి జల సంరక్షణ చర్యలు**

**మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకం**

**'మన్‌కీ బాత్'లో ప్రస్తావించిన ప్రధాని**



**క్రైం కౌంటర్ న్యూస్,** రాయదుర్గం, జనవరి 25: కరువుకు చిరునామాగా ఉన్న అనంతపురం జిల్లాలో ఎడారి ఛాయలు కనిపిస్తున్నాయి. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలోని వేదవతి హగరి నది పరీవాహక ప్రాంతంలో విస్తరిస్తున్న ఇసుక మేటలే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ ప్రభావంతో ఓవైపు భూగర్భజలాలు అడుగంటిపోతుండగా.. మరోవైపు సారవంతమైన భూములు చౌడుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా అధికారులతో పాటు ప్రజలు చేపడుతున్న చర్యలతో పరిస్థితులు మెరుగవుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉద్యాన పంటల సాగు, జిల్లాలో ఎడారీకరణను నియంత్రించే చర్యల్లో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో నీటి కుంటల నిర్మాణాలతో భూగర్భ జలాల పెంపు, మొక్కల పెంపకం లాంటి అంశాల గురించి ప్రధాని మోదీ ఆదివారం తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇసుక మేటలను నియంత్రించేందుకు నీటి యాజమాన్య సంస్థ, అటవీ శాఖ చేస్తున్న కృషి గురించి వివరించారు. భూగర్భ జలాల పెంపుతో పాటు వర్షం నీటి నిల్వ కేంద్రాలను పెంచుకోవడంపై అభినందించారు.

ఇసుక తరలింపునకు చర్యలు

కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో 4 వేల ఎకరాలకుపైగా ఇసుక మేటలు విస్తరించాయి. ఏటా పడమటి వైపు నుంచి వీచే గాలులతో తూర్పు వైపున ఇసుక మేటలు విస్తరించి సాగు భూములను కప్పేస్తున్నాయి. రైతులు పంటలు పండించలేక బీడు భూములుగా వదిలేస్తున్నారు. ఇసుక విస్తరణను నియంత్రించేందుకు 22 గ్రామాల ప్రజలు ఏటా నానా ఇబ్బందులు పడుతుంటారు. ఇసుక మే టల నియంత్రణకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చర్యలు చేపట్టారు. నల్ల రేగడి పొలాల్లో నీటిని నిల్వ చేసుకునేందుకు ఇసుక దోహదపడుతుందని రైతులు భావించడంతో ఇసుక తరలింపునకు 2014 నుంచి అనుమతించారు. ప్రభుత్వం డ్వా మా ఆధ్వర్యంలో రైతులకు చేయూతనందిస్తోంది.మొక్కల పెంపకంతో కట్టడి

ఉద్యాన పంటల సాగుతో ఇసుక మేటల విస్తరణ కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. రాజస్థాన్ ప్రభుత్వ బృందం జిల్లాలో పర్యటించి, ప్రభుత్వానికి ఓ నివేదిక అందించింది. ఇసుక మేటలు విస్తరణను కట్టడి చేసేందుకు పరీవాహక ప్రాంతంలో మొక్కలు పెంచాలని సూచించింది. ఆ మేరకు మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. మొక్కలు తక్కువ సమయంలో ఎక్కువ ఎదుగుదల పొందేలా మియావాకీ పద్ధతి దోహదపడుతుంది. అటవీ, నీటి సంరక్షణ శాఖల ఆధ్వర్యంలో పరీవాహక ప్రాంతంలో గోరింటాకు, సరుగుడు లాంటి మొక్కలతోపాటు ఇసుకపై అల్లుకుపోయే మొక్కలను నాటి ఇసుక మేటల విస్తరణను కట్టడి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 60 కోట్ల దాకా నిధులను మంజూరు చేసి, చర్యలను వేగవంతంగా చేశాయి.

సపోటా సాగుతో కొంతమేర నియంత్రణ

ఉద్యాన పంటల సాగు తో పొలంలో ఇసుక విస్తరణను కట్టడి చేయవచ్చనే అధికారుల సూచనతో ఏడేళ్ల క్రితం సపోటా సా గు చేశా. ఇప్పుడు అధిక దిగుబడి ఇస్తోంది. ప్రభుత్వ మే బోరు వేయించి, డ్రిప్ సౌకర్యం కల్పిస్తోంది. పంట సాగుతో ఇసుక బాగా తగ్గిపోయింది.

# ఇప్పుడు గవర్నర్లే ప్రతిపక్షం!

**న్యాయవ్యవస్థతో రాజ్యాంగానికి ముప్పు**
**నియోజకవర్గాల పునర్విభజనతో ఉత్తరాదిన పెరిగే సీట్లు 158**
**దక్షిణ భారతంలో పెరిగేది 24 స్థానాలే**
**సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వెల్లడి**




క్రైం కౌంటర్ న్యూస్,విజయవాడ, జనవరి 25: రాజ్యాంగ వ్యవస్థలో భాగంగా ఉన్న గవర్నర్లే ఇప్పుడు శాసనసభల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆక్షేపించారు. సాధారణంగా గవర్నర్లు ప్రసంగాలు చేసేటప్పుడు ప్రతిపలు వాకౌట్, నిరసన తెలపడం చేస్తాయని.. నేడు వాటిని గవర్నర్లే చేసి చూపిస్తున్నారని విమర్శించారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ), ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) ఆధ్వర్యంలో విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'భారత రాజ్యాంగం-సవాళ్లు' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేవీవీ ప్రచురించిన 'భారత రాజ్యాంగం-ముఖ్యాంశాలు' పుస్తకాన్ని ఆయన, 'రాజ్యాంగ నిర్మాణం-పీఠిక' పుస్తకాన్ని జేవీవీ వ్యవస్థాపకుడు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యవస్థలే దానికి రకరకాల సవాళ్లు విసురుతున్నాయన్నాయని, వీటిలో న్యాయ వ్యవస్థ కూడా ఉందన్నారు. 'ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్ ఏమీ చదవకుండా వాకౌట్ చేశారు. కర్ణాటక గవర్నర్ ప్రసంగంలోని మొదటి వాక్యం, చివరి వాక్యం చదివి వెళ్లిపోయారు. కేరళ గవర్నర్ ఏకంగా తాను రాసుకున్నదే చదువుతానని చెప్పారు. రాజ్యాంగాన్ని పది రెట్లు పెంచినా, తగ్గించినా.. పాలనా విధానాల ద్వారానే దాని మౌలిక స్వరూపం పూర్తిగా ధ్వంసమవుతుందని అంబేడ్కర్ ఆనాడే చెప్పారు. ఇప్పుడదే జరుగుతోంది' అని తెలిపారు. తమిళనాడులోని మదురైలో దీపం వివాదాన్నీ ప్రస్తావించారు. పార్లమెంటు సమావేశాల్లో కేంద్రం ఏ బిల్లు ప్రవేశపెడుతుందో చివరి క్షణం వరకు ఎంపీలకు తెలియడం లేదన్నారు. ఎజెండాలో లేని అంశాలను స్పీకర్ అనుమతితో సప్లిమెంటరీ అంశంగా ప్రవేశపెడుతున్నారని.ఈ విధంగానే 'వీబీ:జీరామ్‌జీ' బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. ఇలాంటి విధానాలతో సమాఖ్య వ్యవస్థకు ప్రమాదమని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ఎవరికోసమని మాజీ న్యాయమూర్తి నిలదీశారు. నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్‌కు కూడా నోటీసులివ్వడాన్ని ప్రశ్నించారు. కేంద్రం చేయబోతున్న పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ మేలు జరుగుతుందని తెలిపారు. 'కేంద్రం లోక్‌సభ నియోజకవర్గాలను 821 స్థానాలకు పెంచబోతోంది. యూపీలో ఇప్పుడున్న 80 స్థానాలు 2031లో 137కి పెరుగుతాయి. ఏడు ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్న 204 స్థానాలు 362కి చేరతాయి. అంటే 158 సీట్లు పెరుగుతాయి. అదే దక్షిణాదిన 153కు పెరుగుతాయి. ఇక్కడ పెరుగుదల 24 స్థానాలే' అని తెలిపారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కమిషన్ ఏర్పడినప్పుడు.. హిందీ రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్, యూపీ రాష్ట్రాలు కొత్త సమస్యను సృష్టిస్తాయని అంబేడ్కర్ చెప్పారని అన్నారు. ఒక్క ఓటు తేడాతోనే హిందీ అధికార భాష అయిందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, కార్యదర్శి నల్లూరి మాధవరావు, విట్ న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ చక్కా బెనర్జీ, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం వివిధ అంశాలపై ప్రసంగించారు.

## అసెంబ్లీ, సచివాలయాలకు గణతంత్ర శోభ

అమరావతి, జనవరి 25  77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భవనాలు రాత్రివేళ దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. వీటితో పాటు ప్రాంగణంలోని రోడ్లు, సెంట్రల్ పార్కులో విద్యుత్ వెలుగులు మిరుమిట్లు గొలుపుతూ పండుగ వాతావరణం నెలకొంది. సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయం ఉండే మొదటి భవనాన్ని ప్రత్యేకంగా త్రివర్ణ పతాక వర్ణం ఉట్టిపడేలా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సచివాలయ ప్రవేశ మార్గానికి సమీపంలోని ఐదో బ్లాక్, అసెంబ్లీ భవనాన్ని కూడా ఇదే రీతిలో తీర్చిదిద్దారు. గణతంత్ర వేడుకలకు విజయవాడలోని లోక్ భవన్, ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం సహా ప్రకాశం బ్యారేజ్, ఇతర చారిత్రక ప్రాముఖ్యమున్న భవనాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఉదయం 7.30గంటలకు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద సీఎస్ విజయానంద్, 8గంటలకు కౌన్సిల్ భవనం వద్ద శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, 8.15 గంటలకు అసెంబ్లీ భవనం ముందు స్పీకర్ అయన్నపాత్రుడు, 10గంటలకు నేలపాడులోని హైకోర్టు వద్ద చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు.



# మీకు అప్పగించిన శాఖలతో సంప్రదింపులు జరపాలి

**టీడీపీ ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం**
**అమరావతి చట్టబద్ధత బిల్లు ఈ పార్లమెంటు సమావేశాల్లోనే**
**మంత్రి, అధికారులతో టచ్‌లో ఉండండి**
**తెలంగాణ ప్రాజెక్టులకు మనం అభ్యంతరం చెప్పలేదు**
**నల్లమలసాగర్‌పై ఆ రాష్ట్ర వాదన కరెక్టు కాదు**
**పార్లమెంటులో స్పష్టంగా తెలియజేయండి**
**కలెక్టర్ల సదస్సుకూ వర్చువల్‌గా హాజరు కావాలి**
**టీడీపీపీ భేటీలో ఎంపీలకు చంద్రబాబు ఆదేశం**



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, జనవరి 25 : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లోనే మోదీ ప్రభుత్వం బిల్లు పెట్టనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దీనిపై కేంద్రంలోని సంబంధిత మంత్రి, అధికారులతో టచ్‌లో ఉండాలని టీడీపీ ఎంపీలకు సూచించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలు, కేంద్రంతో జరపాల్సిన సంప్రదింపులపై సీఎం వారికి దిశానిర్దేశం చేశారు. 'రాష్ట్రాభివృద్ధిలో ఎంపీల భాగస్వామ్యం కీలకం. మన రాష్ట్రానికి ఇంకేం సాధించవచ్చో ఆలోచించి నిధులు రాబట్టాలి. మీ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి అవకాశాలు, సమస్యల పరిష్కారాలపై దృష్టి పెట్టాలి. కేంద్రంలోని వివిధ శాఖలతో సంప్రదింపులు జరపడానికి ఎంపీలకు కొన్ని శాఖలను అప్పజెప్పాం. ఆయా శాఖలకు సంబంధించి ఏపీలో జరుగుతున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలి. మంత్రులు, కార్యదర్శులతో మాట్లాడాలి. రాష్ట్ర అంశాలపై అవగాహనకు ఫిబ్రవరిలో జరిగే కలెక్టర్ల సదస్సులో ఎంపీలు వర్చువల్‌గా పాల్గొనాలి' అని స్పష్టం చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర-రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకం, పోలవరం-నల్లమల సాగర్ ఈ మూడింటినీ బడ్జెట్ సమావేశాల్లో ప్రాధాన్యాంశాలుగా తీసుకోవాలన్నారు.

**వివాదాలు వద్దు.. నీళ్లు కావాలి..**

కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న క్రమంలో ఏపీ ప్రాజెక్టులకు నిధులు కేటాయించేలా చూడాలని ఎంపీలతో సీఎం అన్నారు. 'పోలవరం ప్రాజెక్టుకు తాజా అంచనాలు ఇచ్చాం. దీని నిర్మాణంతోపాటు ఆర్ అండ్ ఆర్ పూర్తి చేయాలి. రూ.12 వేల కోట్లు ఇంకా కేంద్రం నుంచి రావాలి. 2027 జూన్‌లో జరిగే గోదావరి పుష్కరాల్లోపు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయగలిగితే బావుంటుంది. అలాగే రాష్ట్రంలో నిర్మించతలపెట్టిన నీటి ప్రాజెక్టులపై పొరుగు రాష్ట్రాలతో వివాదాలు అవసరం లేదు. అదే సమయంలో నల్లమలసాగర్ వంటి అంశాలు పార్లమెంటులో ప్రత్యక్షంగానైనా.. పరోక్షంగానైనా ప్రస్తావనకు వస్తే మన వాదనలను గట్టిగా వినిపించాలి. తెలంగాణ కాళేశ్వరం నిర్మించి, మంజీరాకు నీళ్లను తరలించినా ఏపీ అభ్యంతరం చెప్పలేదని కేంద్రానికి అర్థమయ్యేలా చెప్పాలి. అదే సందర్భంలో నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో తెలంగాణ అభ్యంతరం చెప్పడం కరెక్టు కాదని వివరించాలి. ఇక అమరావతి నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. రెండో దశ కూడా ప్రారంభం కానుంది' అని వెల్లడించారు. పూర్వోదయ ప్రాజెక్టు కింద రూ.40 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించామని సీఎం ఎంపీలకు వివరించారు. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు నాలుగు లైన్ల రైల్వే ట్రాక్ వేసేలా చూడాలన్నారు. ఫ్లైవోవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలను రైల్వే శాఖ పెద్దఎత్తున చేపట్టేందుకు సిద్ధంగా ఉందని, పార్లమెంటు నియోజకవర్గాల్లో అలాంటివి ఏమైనా ఉంటే గుర్తించి, నిధులు తెచ్చుకోవాలని సూచించారు.

వైద్య రంగంలో ప్రస్తుతం ఏపీ రెండో స్థానంలో ఉందని, పీపీపీ పద్ధతుల్లో ఆస్పత్రుల నిర్మాణానికి వీజీఎఫ్ కూడా ఇచ్చేందుకు కేంద్రం సుముఖంగా ఉందని చెప్పారు. దీనిని ప్రతి ఎంపీ దృష్టిలో పెట్టుకుని దానికి అనుగుణంగా వ్యవహరించాలని కోరారు. సభలో గానీ, క్షేత్రస్థాయిలో గానీ కూటమి లక్ష్యాలకు విఘాతం కలిగించేలా ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవహరించొద్దని ఆదేశించారు. ఈసారి టీడీపీపీ భేటీకి జనసేన, బీజేపీ ఎంపీలను కూడా పిలుద్దామని.. దీనివల్ల మనవాణికి బలం చేకూరుతుందని తెలిపారు. విభజన సమస్యలు, జాతీయ రహదారుల విస్తరణ, సాగరమాల ప్రాజెక్టుల్లో చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకోవాలన్నారు. 'కేంద్రం నుంచి ఏమేరకు నిధులు రాబట్టవచ్చో చూడాలి. రాష్ట్ర స్థాయి అంశాలే కాకుండా జాతీయ స్థాయిలో ఎన్డీయే చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రతిపలు బీజేపీపై విమర్శలు చేస్తున్న సమయంలో ధీటుగా సమాధానం చెప్పేందుకు చొరవ చూపాలి' అని సూచించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మిగిలిన ఎంపీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి లోకేశ్ సమావేశంలో పాల్గొన్నారు. మరో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు హరీశ్, లక్ష్మీనారాయణ హాజరుకాలేదు.

**జీతాలు లేకున్నా మా జీవితాలు మీ చేతుల్లోనే!**

ఎంపీలు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని.. పార్లమెంటులో మాట్లాడే సమయంలో తగిన సమాచారంతో మాట్లాడితే వ్యక్తిగతంగా ఎంపీలకు, వారితోపాటు పార్టీకి గౌరవంగా ఉంటుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అరకొర పరిజ్ఞానంతో మాట్లాడితే అభాసుపాలవుతామని.. ఇప్పటికీ కొందరు సబ్జెక్ట్‌పరంగా వీక్‌గా ఉన్నారని అలాంటి వారి జీతాలు కట్ చేస్తామన్నారు. ఆ వెంటనే.. అయినా మీ జీతాలు కట్ చేయలేం కదా అని చెప్పారు. కొందరు ఎంపీలు స్పందిస్తూ.. మా జీతాలు మీ చేతుల్లో లేకపోతేం ఏం సార్.. మా జీవితాలు.. మా సీట్లు మీ చేతుల్లోనే ఉన్నాయని అనగా.. సరిగా పనిచేయని వారి విషయంలో అది ఎలాగూ జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు.

# క్యాబినెట్ హోదా ఉన్నా జీతం సౌకర్యాలు తీసుకోబోనని మంతెన సంచలన నిర్ణయం



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25, ప్రముఖ యోగా, ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు తన ప్రభుత్వ పదవికి సంబంధించి ఒక ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యోగా, నేచురోపతి విభాగం సలహాదారుగా నియమితులైన ఆయన, క్యాబినెట్ హోదా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి జీతభత్యాలు గానీ, ఇతర సౌకర్యాలు గానీ స్వీకరించబోనని స్పష్టం చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.గతేడాది డిసెంబర్?లో సీఎం చంద్రబాబు మంతెన సత్యనారాయణ రాజును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. బిల్ గేట్స్ ఫౌండేషన్?తో కలిసి ప్రభుత్వం చేపడుతున్న 'సంజీవని' వంటి ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు ఆయన సలహాలు తీసుకోవాలని సీఎం భావించారు. ఈ నేపథ్యంలో మంతెనతో సీఎం చంద్రబాబు దాదాపు 20 నిమిషాల పాటు చర్చించి, పదవిని చేపట్టాలని కోరారు.అయితే, ఈ పదవిని స్వీకరించడానికి తాను మొదట విముఖత చూపినట్లు మంతెన తెలిపారు. కేవలం తెరవెనుక ఉండి సలహాలు ఇస్తానని చెప్పగా, అధికారిక హోదా ఉంటేనే సూచనలకు విలువ ఉంటుందని, పనులు వేగంగా జరుగుతాయని సీఎం చంద్రబాబు నచ్చజెప్పినట్లు వివరించారు. ముఖ్యమంత్రి కోరికను కాదనలేక పదవిని స్వీకరించడానికి అంగీకరించినప్పటికీ, తాను కొన్ని కఠినమైన షరతులు విధించినట్లు మంతెన పేర్కొన్నారు.నేను ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా జీతంగా తీసుకోను. ప్రభుత్వ వాహనం సహా ఎలాంటి సౌకర్యాలు వినియోగించుకోను. ఈ నిబంధనలకు అంగీకరిస్తేనే బాధ్యతలు చేపడతాను అని సీఎంకు తేల్చిచెప్పగా, ఆయన అందుకు సమ్మతించారని మంతెన వెల్లడించారు. గత 35 ఏళ్లుగా తన పుస్తకాలపై వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నానని, తాను నిర్వహిస్తున్న ఆశ్రమం నుంచి కూడా జీతం తీసుకోలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ ధనం ప్రజలదేనని, దానిని స్వీకరించకూడదనేది తన జీవిత నియమమని ఆయన అన్నారు.

# భూముల మార్కెట్ విలువ పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25, ఏపీలోని పట్టణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను పెంచుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భూముల విలువలను 10 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త ధరలు రాబోయే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు అధికారిక విలువకు, వాస్తవ మార్కెట్ విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.గతేడాది ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూముల విలువలను 5 నుంచి 10 శాతం వరకు సవరించారు. అయితే, ఈసారి పెంపును కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం చేయడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల అశాస్త్రీయంగా ధరలు పెంచారనే విమర్శల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రాంతాల్లో ధరలను తగ్గించడం లేదా స్థిరంగా ఉంచడం చేసింది. తాజాగా మళ్లీ పట్టణ ప్రాంతాల్లో ధరలను సవరిస్తూ నిర్ణయం తీసుకుంది.స్థానిక పరిస్థితులకు అనుగుణంగా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కమిటీలు ఈ విలువల సవరణను ఖరారు చేస్తాయి.



ఆయా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, రోడ్ల కనెక్టివిటీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ పెంపు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సవరించిన ధరల వివరాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

# సినిమా



## ఆ హీరో తండ్రి నాకు దేవుడు

ప్రముఖ నటి విజయశాంతి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు సినిమా ప్రపంచంలో రాములమ్మ అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు ఆమెదే. తెలుగులో ఒకప్పుడు స్టార్ హీరోలతో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ చేసింది. కృష్ణ, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున వంటి అగ్ర హీరోల సరసన నటించింది. ప్రతిఘటన, ఓసేయ్ రాములమ్మ, అడవి చుక్క వంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో మాస్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత సినిమాలకు దూరంగా ఉండిపోయింది. చాలా కాలం తర్వాత సరిలేరు నీకెవ్వరు సినిమాతో రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే సినీపరిశ్రమలో తనకు దివంగత దర్శకుడు టి. కృష్ణ తనకు దేవుడు అని .. ఆయన తన కెరీర్ మలుపు తిప్పారని గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన పట్ల తనకున్న కృతజ్ఞతను, అభిమానాన్ని వెల్లడించారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో ఒక అమ్మాయికి గ్లామర్ పాత్రలు సాధారణంగా లభిస్తాయని, అయితే కళాకారులలోని నటనను బయటకు తీసుకురాగల దర్శకులు చాలా అరుదుగా ఉంటారని ఆమె అన్నారు. అటువంటి దర్శకులలో టి. కృష్ణ అగ్రగణ్యులని, ఆయనకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు.దర్శకుడు టి. కృష్ణ తనలోని నటనా సామర్థ్యాన్ని నేటి భారతం వంటి చిత్రాలతో వెలికితీశారని విజయశాంతి గుర్తుచేసుకున్నారు. “విజయశాంతి కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటించగలదు” అనే పేరు రావడానికి పూర్తి క్రెడిట్ ఆయనకే చెందుతుందని ఆమె స్పష్టం చేశారు. ఆయన తన అన్ని చిత్రాలలో తననే నటిగా ఎంచుకోవడానికి కారణం, విప్లవాత్మకమైన కథలకు, పాత్రలకు తాను సరిపోతానని, తన హావభావాలు అద్భుతంగా ఉంటాయని ఆయన నమ్మడమేనని తెలిపారు. ఆయన తనను “శాంతమ్మ” అని ఆప్యాయంగా పిలిచేవారని, తన ప్రతి సినిమాకు తనే ఉండాలని కోరుకునేవారని విజయశాంతి వివరించారు. ఒక సందర్భంలో, తాను వరుసగా ఆయన చిత్రాలలో నటించడం వల్ల ఆయనకు బోర్ కొట్టదా అని ప్రశ్నించగా, “లేదు శాంతమ్మ, నువ్వే చేయాలి, నువ్వే బాగా చేస్తున్నావు” అని చెప్పేవారని విజయశాంతి పంచుకున్నారు. ప్రతిఘటన చిత్రం సమయంలో అయితే తనకు డేట్లు కుదరకపోయినా, “నువ్వు చేయకపోతే నేను సినిమా చేయను” అని టి. కృష్ణ పట్టుబట్టారని, నిర్మాతలందరినీ ఒప్పించి ఒక నెల రోజుల సమయం తనకు కేటాయించారని ఆమె వెల్లడించారు. తాను చేయలేనని భావించిన ఆ పాత్రను దేవుడు కూడా తనతోనే చేయించారని ఆమె అన్నారు. ఈ చిత్రం తనకు సూపర్?స్టార్ అనే బిరుదును తెచ్చిపెట్టిందని, తన కెరీర్?లో అదొక కీలక మలుపు అని విజయశాంతి స్పష్టం చేశారు.ప్రతిఘటన సమయంలో తాను చిన్న వయసులో ఉండటం వల్ల లెక్చరర్ పాత్రకు సరిపోదని చాలా మంది విమర్శించారని, దర్శకుడు తప్పు చేస్తున్నారని అన్నారని విజయశాంతి తెలిపారు. అయితే, టి. కృష్ణ తనపై పూర్తి నమ్మకంతో, సరైన గెటప్?తో, మేకప్?తో పెద్దమ్మాయిలా కనిపించేలా చేశారని, తాను కూడా ఆ విమర్శలను ఒక సవాలుగా స్వీకరించి అద్భుతంగా నటించానని చెప్పారు. టి. కృష్ణ పట్టుదల, తన సవాలు స్వీకరణ కలసి ఆ సినిమాను అద్భుత విజయం చేశాయని, అది తన జీవితాన్ని పూర్తిగా మార్చివేసిందని ఆమె పేర్కొన్నారు. గ్లామర్?కు అతీతంగా తనలోని నటనను గుర్తించి వెలికితీసిన ఘనత ఆయనదేనని, ఆ తర్వాతే ఇతర గొప్ప దర్శకులు తనతో పని చేశారని విజయశాంతి తెలిపారు. తన కెరీర్?లో ఏడు సినిమాల వరకు టి. కృష్ణతో చేశానని, ఇన్ని అద్భుతమైన పాత్రలు, విజయాలు దక్కడం తన అదృష్టమని ఆమె అన్నారు.





## గుడ్డు తింటే దగ్గు, జలుబు నుంచి ఉపశనం పొందొచ్చా?

గుడ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే గుడ్లను సూపర్?ఫుడ్?లు అంటారు. గుడ్డు తినేందుకు రుచిగా ఉండటంతో పాటు, అవి శరీరానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. గుడ్డులోని తెల్ల భాగం, పచ్చసొన దేనిని విడిచి పెట్టకుండా మొత్తం గుడ్డు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. గుడ్డులోని తెల్ల భాగంలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఇక పచ్చసొనలో ప్రోటీన్, కొవ్వు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఈ ప్రయోజనాలన్నింటితో పాటు గుడ్లు దగ్గు, జలుబు వంటి ఆరోగ్య సమస్యల నుంచి బయటపడటానికి సహాయపడుతుంది అని చాలా మంది నమ్ముతారు.

నిజానికి గుడ్లు దగ్గు,జలుబు నుండి ఉపశమనం పొందడంలో ప్రత్యక్షంగా సహాయపడకపోయినా అవి పరోక్షంగా కూడా సహాయపడతాయి. గుడ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అవి దగ్గును త్వరగా నయం చేయడంలో సహాయపడతాయి. గుడ్లలో ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల, ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఇవి దగ్గు, జలుబుకు వ్యతిరేకంగా పోరాడటానికి శరీరానికి సహాయపడతాయి. గుడ్లలో విటమిన్ డి, బి12 లతో పాటు శరీరానికి అవసరమైన ఇతర పోషకాలు అందిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఈ పోషకాలు శరీరాన్ని సహజంగా రక్షించడంలో కూడా సహాయపడతాయి. అందువల్ల అధిక దగ్గు, జలుబు ఉన్నప్పుడు గుడ్లు తినడం సురక్షితమని నిపుణులు కూడా చెబుతున్నారు. గుడ్లు తినేటప్పుడు గొంతును తేమగా ఉంచడానికి, దగ్గు వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడానికి పుష్కలంగా నీళ్లు తాగాలి. దీనితోపాటు పసుపు, తేనెతో వెచ్చని పాలు లేదా తులసి, తేనె మిశ్రమం కలిపిన నీళ్లు తాగడం వల్ల దగ్గు నుంచి మరింత ఉపశమనం లభిస్తుంది. దగ్గు తీవ్రంగా ఉంటే లేదా జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఇతర తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు.



## టైఫాయిడ్ జ్వరంతో బాధపడేవారికి మునగాకు దివ్యైషధమే..

మునగ ఆకులు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న ఈ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దాదాపు అన్ని సీజన్లలో లభించే మునగ ఆకులు ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని సూప్?ల నుంచి సాంబారు, పాల్య వంటి వివిధ వంటలలో ఉపయోగిస్తారు. ఆయుర్వేదం ప్రకారం, మునగ ఆకులను తీసుకోవడం ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. కాబట్టి దీనిని తీసుకోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చు? ఏ సమస్యకు దివ్యౌషధమో ఇక్కడ తెలుసుకుందాం..

మునగ ఆకు ఆరోగ్య ప్రయోజనాలు

మునగ ఆకు పోషకాలకు నిలయం. కేవలం 100 గ్రాముల మునగ ఆకులో నారింజ కంటే ఏడు రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. మెగ్నీషియం, విటమిన్లు కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి.

టైఫాయిడ్ జ్వరంతో బాధపడేవారు మునగ ఆకులతో పాటు వేర్లను నీటిలో మరిగించి తీసుకోవడం ద్వారా త్వరగా జ్వరాన్ని తగ్గించుకోవచ్చు.

మీకు తీవ్రమైన తలనొప్పి ఉంటే ఈ మొక్క ఆకులను చూర్ణం చేసి తలకు పట్టిస్తే నొప్పి క్రమంగా తగ్గుతుంది.

మునగ చెట్టు వేర్లు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. మీకు గొంతు నొప్పి ఉంటే దాని కాండంతో తయారు తీసిన కషాయంతో పుక్కిలించడం వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

మునగ ఆకును నానబెట్టి లేదా మరిగించి తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.

మీరు శారీరక బలహీనత లేదా అలసటతో బాధపడుతుంటే మునగ పువ్వులు, ఆకులను నీటిలో మరిగించి తాగవచ్చు. ఇది ఆర్థరైటిస్ నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

మునగ ఆకు కాలేయం అంతర్గత ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అయితే దీనిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## భారత క్రికెటర్లు రోహిత్ శర్మ, హర్మన్ ప్రీత్‌కు పద్మశ్రీ

భారత క్రికెట్ రంగానికి చెందిన ప్రముఖ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 2026 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పద్మ అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఇందులో భారత పురుషుల జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ లభించింది.క్రీడా రంగం నుంచి మరికొందరు ప్రముఖులు కూడా ఈ ఏడాది పద్మ పురస్కారాలకు ఎంపికయ్యారు. టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృతరాజ్‌కు దేశంలోని మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ దక్కింది. అదేవిధంగా, భారత మహిళల హాకీ జట్టు క్రీడాకారిణి సవిత పూనియాకు కూడా పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించారు.2026 సంవత్సరానికి గాను మొత్తం 131 పద్మ పురస్కారాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. వీటిలో 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ అవార్డులు ఉన్నాయి. కళలు, సామాజిక సేవ, క్రీడలు, సైన్స్, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ఏటా ఈ పురస్కారాలను అందజేస్తారు. ఈసారి క్రీడా రంగానికి చెందిన పలువురికి పద్మ పురస్కారాలు దక్కడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై రోహిత్ శర్మ ప్రశంసలు

టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తిరిగి ఫామ్‌లోకి రావడంపై హిట్ మ్యాన్ రోహిత్ శర్మ ప్రశంసలు కురిపించాడు. సూర్య ఒక ‹బిగ్ ప్లేయర్‹ అని, అతని ఫామ్ జట్టుకు ఎంతో మేలు చేస్తుందని అన్నాడు. స్వదేశంలో జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు ముందు సూర్య లయ అందుకోవడం జట్టుకు చాలా కీలకమని అభిప్రాయపడ్డాడు.జియోహాట్‌స్టార్‌తో మాట్లాడుతూ రోహిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు.సూర్య లాంటి కీలక ఆటగాడు ఫామ్‌లో లేకపోతే జట్టు బ్యాటింగ్ లైనప్ బలహీనపడుతుంది. అతను నిలకడగా రాణించే ఆటగాడు. సూర్య తన అసాధారణ షాట్లతో ప్రత్యర్థి బౌలర్ల ప్రణాళికలను దెబ్బతీస్తాడు. బంతిని ఊహించని ప్రదేశాలకు తరలిస్తూ ఒత్తిడి పెంచుతాడు. అలాంటి ఆటగాడు ఫామ్‌లో ఉంటే జట్టు మొత్తం ఆత్మవిశ్వాసంతో ఉంటుంది అని వివరించాడు. ఇటీవలే న్యూజిలాండ్‌పై జరిగిన మ్యాచ్‌లో సూర్య 82 పరుగులతో అజేయంగా నిలిచి, దాదాపు 23 ఇన్నింగ్స్‌ల తర్వాత అర్ధశతకం నమోదు చేసిన విషయం తెలిసిందే.సూర్యకుమార్‌కు ఆటపై మంచి అవగాహన ఉందని రోహిత్ తెలిపాడు.ఐపీఎల్‌లో మేమిద్దరం కలిసి చాలా మ్యాచ్‌లు ఆడాం. ఆటలోని పరిస్థితులపై అతని స్పందన చాలా స్పష్టంగా ఉంటుంది. జట్టులోని ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన ఎలా రాబట్టాలో అతనికి బాగా తెలుసుఅని అన్నాడు.ఇదే సమయంలో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటింగ్‌ను కూడా రోహిత్ మెచ్చుకున్నాడు. అభిషేక్ కేవలం దూకుడుగా ఆడటమే కాదు, చాలా తెలివిగా బ్యాటింగ్ చేస్తున్నాడు. పవర్‌ప్లేలో అతను ఇచ్చే మెరుపు ఆరంభాలు జట్టుకు సగం పని పూర్తి చేస్తాయి. బౌలర్లను ఎదుర్కోవడానికి అతను నెట్స్‌లో చాలా కష్టపడతాడు అని రోహిత్ పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో ఒత్తిడితో కూడిన క్షణాలు ఎదురైనా, వాటిని తట్టుకుని నిలబడే సత్తా భారత ఆటగాళ్లకు ఉందని ధీమా వ్యక్తం చేశాడు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com